గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

టీకా వేస్తున్న పశు వైద్యాధికారి గోవింద్ నాయక్

ఇచ్చోడ, మార్చి 28 : వైరస్ వల్ల వచ్చే రోగాల నుంచి తమ పశువులను కాపాడుకునేందుకు గాలింకుంటు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. మండలంలోని గేర్జం గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు పూర్తిగా ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

మాట్లాడుతున్న ఎస్ఐ ధనశ్రీ

తాంసి(తలమడుగు), మార్చి 28 ః మండలంలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ధనశ్రీ అన్నారు. గురువారం తలమడుగు మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నియమావళి అమలులో ఉన్నందున మండలంలోని గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినట్లైతే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ రుసుం తగ్గించాలి

డీటీ మల్లేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్, మార్చి 28 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్-టెట్ 2024) రుసుం తగ్గించాలని బోథ్ డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్‌కు గురువారం బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఇటీవల అర్హత పరీక్ష రుసుం పెంచిందన్నారు. దీంతో నిరుద్యోగులకు ఆర్థిక భారం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లెపూల సుభాష్, మల్లెపూల స్వామి, భీమ బుచ్చన్న, కాడి రాజేందర్, రాథోడ్ రవి, ఆడె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు బంగారు గొలుసు అప్పగింత

బంగారు గొలుసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 : ఆదిలాబాద్‌లోని బ్రాహ్మణవాడకు చెందిన ఓ మహిళ తన రెండున్నర తులాల బంగారు గొలుసును అనుకోకుండా చెత్తబుట్టలో గురువారం పడేసుకున్నది. ఇంట్లో ఎంత వెతికినా దొరకలేదు. చెత్తబుట్టలో పడి ఉంటుందన్న అనుమానంతో కౌన్సిలర్ లాలా మధు మున్నకు సమాచారం అందించారు. స్పందించిన కౌన్సిలర్.. బంగారు గొలుసు విషయాన్ని మున్సిపల్ సిబ్బంది శ్యాం, రమేశ్‌కు తెలిపారు. డంప్ గొలుసు వెతికి తిరిగి సదరు మహిళకు అప్పగించారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న సంఘం అధ్యక్షుడు సలీం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను వికలాంగులు కోరారు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ జిల్లా వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బడ్జెట్‌లో 5శాతం నిధులు వికలాంగులకు కేటాయించాలన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగులు కేటాయించాలని, తదితర సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సలీం, ప్రధాన కార్యదర్శి సురేశ్, సుకుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 : పేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం మాలే బోరిగాంలో నివాసం ఉంటున్న జంగుబాయి ఇంట్లో ఏప్రిల్ 5వ తేదీన వివాహం ఉండగా, గురువారం మాజీ సర్పంచ్ కొమురా రాజు, గెడం రాము కలిసి పెండ్లి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

అధ్వానం.. నిర్వహణ లోపం

- 'ప్రత్యేక' పాలనతో సెగ్రిగేషన్ షెడ్లపై పర్యవేక్షణ కరువు..
- ధ్వంసమైన సేంద్రియ ఎరువుల తయారీ అరలు
- కేసీఆర్ సర్కారు హయాంలో అద్దంలా పల్లెలు
- అధికారులు పట్టించుకోవాలని కోరుతున్న స్థానికులు

సేంద్రియ ఎరువు, తడి, పొడి చెత్త వేరు చేసే అరలు అధ్వానంగా ఉన్న మహాగావ్‌లోని సెగ్రిగేషన్ షెడ్డు

నార్నూర్, మార్చి 28 : కేసీఆర్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రగతి' కార్యక్రమాలు గ్రామాల ముఖ చిత్రాలనే మార్చేశాయి. స్వచ్ఛ పల్లెలే ధ్యేయంగా ఊరికో డంప్ యార్డును నిర్మించగా.., పల్లెలు అద్దంలా దర్శనమిచ్చాయి. ప్రతి రోజూ పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ట్రాలీల ద్వారా ఇంటింటా తడి, పొడి చెత్తను తరలించగా, వాడలన్నీ మెరిసిపోయాయి. ఆ చెత్తను వేర్వేరుగా అరల్లో వేసి, సేంద్రియ ఎరువు తయారు చేసేవారు. తద్వారా దానిని గ్రామంలో రైతులకు విక్రయించడంతో పంచాయతీకి ఆదాయం వచ్చేది. వీటి నిర్వహణతో పంచాయతీలు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. కాగా, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు ప్రత్యేకాధికారుల పాలనతో ఈ కార్యక్రమం నీరుగారిపోతున్నది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణా లోపంతో అభివృద్ధి పనుల నిర్వహణ కుంటుపడుతున్నది.

ఉమ్మడి నార్నూర్ (గాదిగూడ, నార్నూర్) మండలంలో 48 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేసీఆర్ సర్కారు గ్రామానికో సెగ్రిగేషన్ షెడ్డును (రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.96 లక్షలతో) నిర్మించింది. దీంతో పంచాయతీ సిబ్బంది ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను ఈ షెడ్లకు తరలించేవారు. సేంద్రియ ఎరువు తయారు చేసేవారు. తద్వారా దానిని గ్రామంలో రైతులకు విక్రయించడంతో పంచాయతీకి ఆదాయం సమకూరేది. కానీ, ప్రస్తుతం ఆ వ్యవస్థ కుంటుపడింది. పంచాయతీలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్ నిర్వహణ ఆధ్వానంగా తయారైంది. పారిశుధ్య నిర్వహణ అధికారులకే తెలుసంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ సెగ్రిగేషన్ షెడ్ మందుబాబులకు అడ్డగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కాగా, 'నమస్తే' ఏ జీపీలోని సెగ్రిగేషన్ షెడ్డును సందర్శించినా డిజిటల్ కీ రాలేదంటూ పంచాయతీ కార్యదర్శులు మాటలు దాటేస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారి స్పందించి, సెగ్రిగేషన్ షెడ్డును వినియోగంలోకి తెచ్చేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీవో ఆనంద్‌ను వివరణ కోరగా, పంచాయతీలో నిధులు లేవని సమాధానమిచ్చారు. త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

రూమన్‌కస గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డు

పర్యవేక్షణ కరువైంది..

నార్నూర్, మార్చి 28 : చాలా రోజులుగా అధికారులు పారిశుధ్యంపై పట్టించుకోవడం లేదు. పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పంచాయతీలకు నిధులు లేవంటూ చెబుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణ ఊసే కనిపించడం లేదు. జిల్లా అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఇలాగే ఉంటే గ్రామాల్లో ప్రజలు ఆనారోగ్యం బారినపడే అవకాశాలు లేకపోలేదు.

- కోడప జాకు, కునికస గ్రామం

బోథ్‌లో ఉపాధి పనుల పరిశీలన

బోథ్ సమీపంలోని గుట్టలో సీసీటీ పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో సాయన్న

బోథ్, మార్చి 28 : మండల కేంద్రం సమీపంలోని గుట్ట ప్రాంతంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం డీఆర్డీవో సాయన్న పరిశీలించారు. కూలీలు కంటిన్యూ కాంటూర్ ట్రెంచెస్ తవ్వకం పనులు చేస్తున్నారు. అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. ఎంత మంది పనులకు వస్తున్నారు.., పని జరిగే ప్రదేశం ఫొటోలను ఎప్పటికప్పుడు తీస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. కూలీల హాజరు శాతం పెంచేలా చూడాలన్నారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పీడీ వెంట ఎంపీడీవో రమేశ్, ఏపీవో జగ్దేరావు, టీఏ మధూకర్, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

క్షయ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



గాదిగూడలో వివరాలు తెలుసుకుంటున్న డీపీఎంవో రమేశ్

నార్నూర్, మార్చి 28 : క్షయ సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీపీఎంవో రమేశ్ వైద్య సిబ్బందికి సూచించారు. గాదిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్షయపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దగ్గు, రక్తపు చాయలు, దగ్గినప్పుడు చాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, హెచ్ఈవో పవార్ రవీందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బేలలో పోలీస్ కవాతు

బేలలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జైనథ్(బేల), మార్చి 28 : ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు బేల మండల కేంద్రంలో గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని బేల ఎస్ఐ రాధిక సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎస్ఐ పురుషోత్తం, పోలీసులు పాల్గొన్నారు.

నష్టం జరగకుండా చూడాలి

స్త్రీ నిధి రికవరీని డీఆర్డీవో విజయలక్ష్మికి అందజేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కుంటాల, మార్చి, 28: కూలీలకు నష్టం జరగకుండా వేతనాలు కొలతల ప్రకారం చెల్లించాలని డీఆర్డీవో విజయ లక్ష్మి సూచించారు. కుంటాల మండల కేంద్రంలోని రైతు వేదిక హాలులో లోకేశ్వరం, నర్సాపూర్, కుంటాల, కుభీర్, భైంసా, ముథోల్, బాసర, తానూర్ మండలాలకు చెందిన ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం గురువారం ఆమె నిర్వహించారు. కూలీల నివేదిక, నర్సరీలు, బోర్‌వెల్, ఇతర నిర్మాణాల పనులపై సమీక్షించారు. హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, డీఆర్పీ గంగాప్రసాద్, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలోని శానిటరీ న్యాప్కిన్ తయారీ కేంద్రాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి సందర్శించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. దీంతో పాటు మండల కేంద్రంలో వీవోలకు పొదుపు, రికవరీలపై అవగాహన కల్పించారు. రెండు సంఘాల ద్వారా రికవరీ చేసిన రూ. 1,06,000 నగదును డీఆర్డీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, సిబ్బంది ఉన్నారు.

కడెంలో..

కడెం, మార్చి 28: ప్రతి గ్రామ పంచాయతీలో కూలీలకు ఉపాధి హామీ పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. కడెం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఏపీవో, టీఏ, ఎఫ్ఏ, ఈసీలతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ వేసవిలో ప్రతి గ్రామ పంచాయతీలో కూలీలకు కనీసం 400 మందికి ఉపాధిహామీ పనిని కల్పించాలని ఆదేశించారు. ప్రతి కూలీకి వంద రోజుల పనిని కల్పించడం, వేతనాలను కూడా వారి ఖాతాల్లో వెంటనే జమ చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కూలీలకు పని కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

పరీక్షలు ప్రశాంతం

భీంపూర్, మార్చి 28 : భీంపూర్ మండలం అందర్‌బంద్‌లోని పరీక్షా కేంద్రంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం 114 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఒకరు గైర్హాజరయ్యారు. ఎండల నేపథ్యంలో విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించారు. కాపీయింగ్ జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. భీంపూర్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో ప్రజాప్రతినిధులు

భీంపూర్, మార్చి 28 : భీంపూర్ మండలం అర్లి(టీ)లో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు బొంత నితిన్, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింలకు గురువారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. సమాజ ప్రగతిలో సామరస్యత, ఐక్యత కీలకమని జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ అన్నారు. ఈ విందులో కో-ఆప్షన్ మెంబర్ జహూర్‌అహ్మద్, నాయకులు ధరంసింగ్, బాదర్, సంజీవ్‌రెడ్డి, గొల్లి లస్మన్న, రవూఫ్, షేక్ అఫ్రోజ్ తదితరులున్నారు.

మట్కా జూదరుల అరెస్ట్

మట్కా జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

భీంపూర్, మార్చి 28 : భీంపూర్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ సిబ్బందితో గురువారం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో సరిహద్దు గోవిందపూర్ వద్ద ముగ్గురు మట్కా జూదరులను పట్టుకున్నారు. వీరిలో మహారాష్ట్ర కిన్వట్ తాలూకా పాటోదకు చెందిన భగత్ జైపాల్, భీంపూర్ మండలం కామట్‌వాడకు చెందిన కరాడే సౌరభ్, బేల్సరి రాంపూర్‌కు చెందిన సిడాం జంగు ఉన్నారు. వీరి నుంచి రూ.3240, 3 మట్కా చీటీల బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగు నీటికి ప్రత్యేక చర్యలు

గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ఉట్నూర్ రూరల్, మార్చి 28 : తాగునీటికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఏసీఎంవో జగన్ అన్నారు. పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎర్రగుట్ట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యకు త్వరలో బోరు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఆర్‌వో ఆత్రం బలిరాం, గోవిందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేతకాని సమాజానికి క్షమాపణ చెప్పాలి

ఎదులాపురం, మార్చి 28 : నేతకాని సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన గుమ్మడి కుమార్‌స్వామి.. నేతకాని సామాజనికి వెంటనే క్షమాపణ చెప్పాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గంశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సర్పే సోంబాయితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గుమ్మడి కుమార్‌స్వామి నేతకాని సమాజాన్ని కించపరిచేలా, తమ మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తమ నుంచి తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు జాడి లక్ష్మణ్, పట్టణ యూత్ అధ్యక్షుడు రాహుల్ జాందడే, కార్యదర్శి సూరజ్‌సోన్‌కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

పత్తి డబ్బు రాని రైతులు ఏఎంసీ కార్యాలయంలో సంప్రదించాలి

ఇంద్రవెల్లి, మార్చి 28 : సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి, డబ్బు రాని రైతులు మండలంలోని ఏఎంసీ కార్యాలయంలో సంప్రదించాలని ఏఎంసీ కార్యదర్శి రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు కేంద్రంలో మండల రైతులు పత్తిని విక్రయించారని తెలిపారు. కొన్ని లోపాల వల్ల రైతులకు డబ్బు రాలేదని పేర్కొన్నారు.

నాగోబాను దర్శించుకున్న సుగుణక్క

ఇంద్రవెల్లి, మార్చి 28 : మండలంలోని కెస్లాపూర్ నాగోబాను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతోపాటు కాంగ్రెస్ ఎంపీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క దర్శించుకున్నారు. గురువారం నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగోబా ఆలయ అభివృద్ధితో పాటు వివిధ అంశాలపై మెస్రం వంశీయులతోపాటు నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు, నాయకులు వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం వంశీయులు కటోడ కోసేరావ్, బాజీరావ్‌పటేల్, నాగ్‌నాథ్, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మాజీ మండలాధ్యక్షుడు సోమోరే నాగోరావ్, జిల్లా నాయకులు కనక వెంకటేశ్, సోన్‌కాంబ్లే జితేందర్, కాంబ్లే ఆతిశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అమరవీరుల స్తూపానిన సందర్శించారు. నాయకులతో కలిసి నివాళులర్పించారు. అక్కడి నుంచి అంబేద్కర్ చౌక్‌కు వెళ్లి, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి సోన్‌కాంబ్లే మనోహర్, వాగ్మారే కామ్‌రాజ్‌తోపాటు దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 : యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరమైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ డీఎండబ్ల్యూవో రాజలింగు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు రిజర్వేషన్ల నియామం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్డ్ కేటగిరీల్లో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. www.tmreistelangana.cgg.gov.inలో ఏప్రిల్ 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక

ఉట్నూర్, మార్చి 28 : ఉట్నూర్ బార్ అసోషియన్ ఎన్నికలు గురువారం ఎన్నికల అధికారి డీ బాపురావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా జీ బాపురెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా బానోత్ జగన్, జాయింట్ కార్యదర్శిగా పవార్ వసంత్‌రావు, కోశాధికారులుగా చింతల గిరి, కే శ్రీనివాస్, లైబ్రరి కార్యదర్శిగా జైవంత్‌రావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు జీ బాపురెడ్డి మాట్లాడుతూ.. తన నమ్మకంపై గెలిపించిన ఉట్నూర్ బార్ అసోషియన్ న్యాయవ్యాధుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఏప్రిల్ నుంచి హెవీ వెహికిల్ డ్రైవర్స్ ట్రైనింగ్ ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 : టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటర్ వెహికిల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్‌కు ఏప్రిల్ 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ కల్పన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30 రోజులు ఉంటుందని తెలిపారు. అందుకు ఫీజులు రూ.15,600 ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నంబర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ యూసుఫ్ 73828 40349 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 : ఆదిలాబాద్ రూరల్ మండలం కొత్తగూడకు చెందిన దేవర్తి శివయ్య(48) గురువాం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. శివయ్య పాల వ్యాపారం చేసేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మనస్థాపం చెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

కుంటాల, మార్చి 28: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి ని పాటించాలని ఉమ్మడి కుంటాల మండల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్ లీడర్, ఎంపీడీవో అబ్దుల్ రహీం అన్నారు. ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ భవనాలు లాంటి ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించకూడదని, వ్యక్తిగత జీవితాన్ని హరించే దూషణలు, ఆరోపణలకు దూరంగా ఉండాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సూచించారు. అనుమతి లేనిదే ప్రచార సామగ్రిని గ్రామాల్లో ఏర్పాటు చేయకూడదని ఒక ప్రకటనలో కోరారు.